జిల్లాలో ఆరుగురిపై పీడీ యాక్టు : తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో ఆరు మందిపై పిడి యాక్ట్ నమోదు చేసినట్టు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పునరావృత నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల తిరుపతి జిల్లాలో పదే పదే డ్రగ్స్, గంజాయి నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపైన తిరుచానూరు, శ్రీకాళహస్తి వన్ టౌన్, శ్రీకాళహస్తి టు టౌన్, తడ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు చేసిన కేసులు పరిశీలించి, నిందితులపై పిట్ ఎన్డిపిఎస్, పీడీ యాక్ట్ అమలు చేశామని తెలిపారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కారని సాయికుమార్ (22), బాల బృందమ్మ కాలనీకి చెందిన చెరుకూరు వంశీ (24), వీఎంపల్లికి చెందిన పైపురి వేణుగోపాల్ (45), పి.పరంధామయ్య (58), తిరుపతి పద్మావతి పురానికి చెందిన సాడు హరి(28), నల్లా మురళి (31)లపై పిడి యాక్ట్ నమోదు చేసామని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి విక్రయం, రవాణాను గమనించిన పక్షంలో వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్, 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పి రవిమనోహరాచారి, డిఎస్పిలు కే.ఎన్.మూర్తి, జి.చెంచుబాబు, సి.ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కోళ్లకు కోలుకోలేని దెబ్బ

▪ నాటు కోళ్ల అంతు చూస్తున్న వైరస్ ▪ వేలల్లో మృత్యువాత ▪ నైరాశ్యంలో పెంపకం దారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో అధికశాతం మంది పాడి పరిశ్రమతో పాటు నాటు కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. కరువుకాటకాలకు నిజమైన ప్రత్యామ్నాయంగా పాడి, కోళ్ల పెంపకాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. అయితే కోళ్ల సంపదను కాపాడటంలో పశుసంవర్ధకశాఖ నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం, సత్యవేడు మండలాల్లో గడిచిన వారం రోజుల వ్యవధిలో వేల సంఖ్యలో నాటు కోళ్లు మృత్యువాత పడుతుండటమే ఇందుకు ఉదాహరణ. కళ్లెదుటే పెంచుకున్న కోళ్లు కడతేరి పోతుండడంతో పెంపకందారుల బాధలు వర్ణణాతీతం. ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయకపోవడంతోనే కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పెంపకందారులు ఆరోపిస్తున్నారు.

గూటికి చేరగానే గుటుక్కు..!

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో అంతుచిక్కని వైరస్‌తో చనిపోయిన కోళ్ల సంఖ్యను చెప్పలేమంటున్నారు రైతులు. నవంబరులో ఏర్పడ్డ వరుస తుపానుల వల్ల పారిశుద్ధ్యం దెబ్బతినడం, మరోవైపు చలి తీవ్రత పెరిగిన కారణంగా అంతు చిక్కని వైరస్ కోళ్లను కబళించేస్తోందని రైతులు చెబుతున్నారు. రోజంతా ఆరోగ్యంగా మేత తింటున్న కోళ్లు గూటికి చేరాక గుటుక్కుమంటున్నాయని వాపోతున్నారు. ఈ లెక్కన ఒక్కో ఇంట్లోనే ఒక్క కోడి కూడా మిగలకుండా తెల్లారేసరికి మృత్యువాత పడుతున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా జాతి కోళ్లు, పెరటి కోళ్లు, పందెం కోళ్లకు ఈ వైరస్ సోకడం వల్ల అపార నష్టం వాటిల్లుతోంది. ఇది కొక్కెర తెగులు అన్న అభిప్రాయాన్ని పశు వైద్యులు వ్యక్తం చేస్తున్నారు. సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వేల సంఖ్యలోనే నాటు కోళ్లు మృతి చెందాయని పెంపకం దారులు వాపోతున్న పరిస్థితి. ఇప్పటికైనా పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే స్పందించి నాటు కోళ్ల మృత్యువాత పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పెంపకందారులు కోరుతున్నారు.

టీకాలు వేయలేదు : వెంకటేష్, పెంపకం దారుడు, బోనుపల్లి

మా గ్రామంలో 600కు పైగా నాటు కోళ్లు మృతి చెందాయి. ఒక్కరోజు వ్యవధిలోనే మా ఇంటి కోళ్లు 15 మృతి చెందాయి. అందులో జాతి పుంజులే ఎక్కువ. పశు వైద్యాధికారులు టీకాలు వేసిన పాపాన పోలేదు.

వ్యాధిని గుర్తిస్తాం : గోవిందరాజ భాస్కర్, ఏడీఏ, పశుసంవర్ధక శాఖ, శ్రీకాళహస్తి

వర్షాల కారణంగా పారిశుద్ధ్యం దెబ్బతిన్న నేపథ్యంలో కొక్కెర తెగులు అధికంగా వ్యాపించే అవకాశం ఉంటుంది. ముందస్తు టీకాలు వేసుకుంటే నివారణ సాధ్యమయ్యేది. నాటు కోళ్ల అకస్మాత్తు మృతిపై పరిశీలన చేస్తాం. వ్యాధిని గుర్తించి నివారణా చర్యలు చేపడతాం.

అధికారులు అందుబాటులో ఉండాలి

కమిషనర్ ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దిత్వా తుఫాన్ నేపథ్యంలో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే పరిస్థితి ఉందని, నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వెంటనే సాయం అందించేందుకు అన్ని విభాగాల అధికారులు అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులు, సిబ్బందికి కమిషనర్ దిశానిర్దేశం చేశారు. కార్యాలయంలో 24గంటల పాటు టోల్ ఫ్రీ నంబర్లు 0877- 2256776, 9000822909 లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కాలువల్లో ఎక్కడా మురుగునీరు ఆగకుండా.. రోడ్లపైకి రాకుండా చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు కలుషితమవకుండా క్లోరినేషన్ చేయాలని సూచించారు. మ్యాన్‌హోల్ ఓపెన్ చేసిన ప్రాంతాల్లో, అండర్ బ్రిడ్జిల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపునీరు ఆగకుండా మోటార్లతో నీరు పంపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. హోర్డింగులు, ఫ్లెక్సీలు కింద పడకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఎస్ఈలను తగుచర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా చెట్లు పడితే ఉన్నా, విద్యుత్ అంతరాయం ఏర్పడినా కంట్రోల్ రూమ్ ను సంప్రదించాలని తెలిపారు. పురాతన భవనాల్లో నివాసం ఉండొద్దని ప్రజలను సూచించారు. నగరపాలక సంస్థ సిబ్బంది రైన్ కోట్లు, రేడియం స్టిక్కర్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని విభా గాల అధికారులు సమన్వయం చేసుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

భవన నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

నగరంలో భవన నిర్మాణాలకు నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సూచించారు. శనివారం ఉదయం నగరంలోని భూపాల్ హౌసింగ్ కాలనీ, కూరపాటి లేఔట్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి కమిషనర్ పర్యటించారు. తమ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది, పార్కు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలను పరిశీలించాలని, తప్పనిసరిగా అనుమతులు ఉండాలని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే సంబంధించిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుక్కల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని వెటర్నరీ ఆఫీసర్‌ను ఆదేశించారు. భూపాల్ హౌసింగ్ కాలనీలో డ్రైనేజి కాలువల నిర్మాణానికి, పార్కు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య , మున్సిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ లు వెంకట ప్రసాద్, శిల్ప, ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

ప్రజా గాయకుడు పెంచలయ్య హత్య.. ప్రభుత్వ వైఫల్యమే

హత్య చేసిన గంజాయి ముఠాను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి : సిపిఎం, ఐద్వా

కేండిల్స్ వెలిగించి నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. సాయి లక్ష్మి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నెల్లూరు జిల్లా, వేదయ పాలెం డి.ఆర్.డి.టి కాలనీకి చెందిన ప్రజానాట్య మండలి యువ నాయకుడు, ప్రజల్లో మాదకద్రవ్యాల ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ నిరంతరం పోరాడిన కామ్రేడ్ పెంచలయ్యను, గంజాయి ముఠా గుండాలు కాపుగాసి చాలా దారుణంగా నిన్న (శుక్రవారం) బైక్‌పై వెళుతుండగా కత్తులతో వెంటాడి దారుణంగా హత్య చేసిన ఘటనపై సిపిఎం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.ఈ నేపథ్యంలో నేడు తిరుపతిలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పెంచలయ్యకు నివాళులు అర్పించి, దోషులను వెంటనే అరెస్టు చేసి అత్యంత కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. సాయి లక్ష్మిలు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అన్నివర్గాల ప్రజలను నాశనం చేస్తున్న ఈ పరిస్థితుల్లో, ప్రజల్లో అవగాహన కల్పిస్తు ప్రజలను చైతన్యం చేస్తున్న పెంచలయ్య పోరాటాలను గంజాయి ముఠా భరించలేకే ఈ పిరికిపంద హత్య జరిగిందిని, స్కూళ్లు, కళాశాలలు, బస్టాండ్లు, వీధివీధిలో పాటలతో ప్రజలను మేల్కొల్పిన పెంచలయ్యను నిశితంగా లక్ష్యంగా చేసుకుని హత్య చేయడం రాష్ట్రంలో నేర నిర్మూలనలో ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. దుండగులు ఎవరైతే ఉన్నారో వారిని 24 గంటల్లో అరెస్టు చేయాలి. నేర ముఠాలకు రాజకీయ పరిరక్షణ కల్పించే వ్యవస్థను ప్రభుత్వం వెంటనే కూలదోలాలి. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారికి జీవితఖైదు సహా అత్యంత కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ గత ప్రభుత్వం కాలంలో మాదకద్రవ్యా లపై నియంత్రణ లేకుం డా పోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక 'గంజా యి రహిత రాష్ట్రం' చేస్తామన్న హామీ మాటలకే పరిమితం అయింది. ఆచరణలో లేకపోవడంతో గంజాయి ముఠాలు, మాదకద్రవ్య గ్యాంగులు బలపడి, అవగాహన కల్పించే కార్యకర్తల పైనే దాడులు చేస్తున్నాయి. ఇది ప్రభుత్వ వైఫల్యానికి అత్యంత ప్రమాదకర సంకేతం. అని వ్యాఖ్యానించారు. చివరిగా వారు హెచ్చరిస్తూ ప్రజా సమస్యలపై నిజాయితీగా పనిచేసే పెంచలయ్యలాంటి నాయకులను ఇలాగే అంతం చేస్తే కూర్చుని చూడబోమని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం భారీ స్థాయిలో నిరసనలు, ఆందోళనలు చేపడుతుందన్నారు. దోషులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.మాధవ్, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, రవి, అక్బర్, ఎం.జయంతి, ఈశుఫ్ భాష, రామకృష్ణ, లోకేష్, మురళి, వినోద్, అశోక్, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్య ఉద్యమకారులపై గొడ్డలి పెట్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య హత్య సామాజిక ఉద్యమకారులపై గొడ్డలి పెట్టు లాంటిదని ప్రజానాట్యమండలి శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గెడి వేణు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పెంచలయ్య సంతాప సభ నిర్వహించారు.

సంతాప సభలో ప్రజానాట్యమండలి శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గెడి వేణు

సమాజంలో వివిధ రూపాల్లో పేరుకుపోయిన అవినీతి, అక్రమాలు, దురాచారాలు, దుర్మార్గాలను ఎండగట్టే అతి ముఖ్య పాత్రను ప్రజానాట్యమండలి కళాకారులు పోషిస్తున్నారని తెలిపారు. ఈ కోణంలోని నెల్లూరు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న గంజాయి విక్రయాలకు వ్యతిరేకంగా పెంచలయ్య తన గళం విప్పి ప్రజలను చైతన్యపరిచేందుకు పూనుకున్నాడని వివరించారు. ఇది గిట్టని గంజాయి ముఠా పెంచలయ్యను అతి కిరాతకంగా కత్తులతో హతమార్చారని వాపోయారు. ఇది పెంచలయ్య హత్య మాత్రమే కాదనీ, సామాజిక ఉద్యమకారులపై గొడ్డలి పెట్టు అని విచారం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే అంతు చూసే స్థాయికి చెలరేగిపోతున్న గంజాయి ముఠాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఉక్కు పాదం మోపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పెంచలయ్య హత్యలో పాలుపంచుకున్న గంజాయి ముఠాని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సుబ్రహ్మణ్యం, వెంకటేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటులో ముందడుగు

ఎంపీ మద్దిల గురుమూర్తి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాట్లు ముందడుగు పడింది. తిరుపతి పార్లమెంట్ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయం అవసరం ఉందని గుర్తించిన ఎంపీ మద్దిల గురుమూర్తి ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇటీవల జవహర్ నవోదయ విద్యాలయ సమితికి లేఖ రాశారు. తిరుపతిలో ఐఐటీ, ఐజర్ వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, గ్రామీణ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్యావకాశాలు తక్కువగా ఉన్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆయన విజ్ఞప్తికి స్పందించిన నవోదయ విద్యాలయ సమితి, ప్రతి జిల్లాలో ఒక నవోదయ విద్యాలయం ఉండాలనే పథకం ఉన్నప్పటికీ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో ఇంకా ఈ పాఠశాల లేని విషయం గుర్తించింది. నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థలాన్ని ఉచితంగా కేటాయించాల్సి ఉంటుందని, శాశ్వత భవనం నిర్మాణం అయ్యేవరకు తాత్కాలిక భవనాన్ని కూడా రాష్ట్రం అందించాల్సి ఉంటుందని సమాధానం ఇచ్చింది. తిరుపతి జిల్లాలో నవోదయ విద్యాలయ ఏర్పాటు కోసం అనువైన స్థలం కేటాయించేందుకు ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. త్వరలోనే నవోదయ విద్యాలయం తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ ఏర్పాటు అవుతుందని ఎంపీ గురుమూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

రామాపురం డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రామాపురం వద్ద ఉన్న చెత్త నిర్వహణ డంపింగ్ యార్డును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ శనివారం అధికారులతో కలసి పరిశీలించారు. చెత్త నిర్వహణ ఎలా చేస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? తదితర విషయాలను పరిశీలించారు. గడువు లోపు చెత్త నిర్వహణ పూర్తి చేయాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ తదితరులున్నారు.

క్రికెట్ స్టేడియం పురోగతి పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, గొల్లవాని గుంట ప్రాంతంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, పలు క్రీడా ప్రాంగణాల పురోగతిని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం పరిశీలించారు. పనులు మరింత వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. త్వరితగతిన ఈ వసతులు క్రీడాకారులకు అందుబాటులోకి రావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డిఎస్‌డిఓ శశిధర్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గంగమ్మ గుడి చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లా కలెక్టర్‌ని తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయం చైర్మన్ మహేష్ యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ అధికారులు అర్చకులతో కలిసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. వీరితో పాటుగా శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌లున్నారు.

పోలీసులంతా అమ్మవారి చుట్టే..!



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుచానూరు పద్మావతి అమ్మవారి పంచమితీర్థానికి పోలీసులు బారీ భద్రత ఏర్పాటు చేశారు. గత అనుభవాల దృష్ట్యా పోలీసు బాస్ అన్ని తానై పర్యవేక్షించారు. వేలాది మంది పోలీసులతో పహారా నిర్వహించారు. అలిమేలుమంగాపురానికి వచ్చే దారులన్ని పోలీసులమయమయ్యాయి. ఎట్టకేలకు పంచమి తీర్థం సాఫీగా పూర్తికావడంతో అమ్మయ్యా అని ఊపిరి పీల్చుకోవడం గమనార్హం. రెండు రోజులు ముందే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జిల్లా పర్యటనకు రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల తర్వాత అంతటి ప్రసిద్ధిగాంచినది తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పంచమతీర్థం. అలిమేలు మంగమ్మ కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు అమ్మవారి పుష్కరణిలో చక్రత్వార్ మునగే వేడుకను పంచమితీర్థం అంటారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూల నుంచి, రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడు నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు విచ్చేస్తారు. ఒక పంచమితీర్థం రోజే అమ్మవార పుష్కరణిలో రెండు నుంచి 3 లక్షల మంది భక్తులు స్నానం ఆచరించడం దీని ప్రత్యేకత. ఇంతటి ప్రాముఖ్యతగల ఈ వేడుకల్లో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా, భక్తులకు మెరుగైన భద్రత కల్పించేందుకు జిల్లా పోలీసులు నెల రోజులుగా ప్రణాళికలు రచించి, వాటిని పక్కాగా అమలు చేసి విజయం సాధించారు. తిరుపతిలో గత వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు శ్రీవారి దర్శన టోకన్లు మంజూరు సందర్భంగా, జరిగిన తొక్కిసిలాటలో 6 మంది భక్తులు మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదానికి బాధ్యులను చేస్తూ, ప్రభుత్వ చర్యలకు గురైన వారిలో ప్రస్తుతం జిల్లా పోలీసు బాస్ కూడా ఒకరు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సారి ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వకుడదని బావించి అన్ని తానే అయ్యి పర్యవేక్షించారు. తిరుచానూరు పంచమికి 2వేల మంది పోలీసులతో భద్రత విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. వీరికి టిటిడి విజిలెన్స్ సిబ్బంది, టిటిడి ఉద్యోగులు, శ్రీవారి సేవకులు అదనం. పుత్తూరు, నగరి నుంచి తిరుచానూరుకు వచ్చే పూడి, ముండ్లపూడి మార్గం, తిరుపతి రూరల్ నుంచి వచ్చే వారికి యోగమల్లవరం మార్గం, చిత్తూరు నుంచి వచ్చే 150 బైపాస్ రోడ్డు, శ్రీకాళహస్తి, వెంకట గిరి నుంచి వచ్చే కలెక్టరేట్ మార్గం, తిరుపతి నుంచి వచ్చే ప్రదాన మార్గం. అన్నిటిని పోలీసులు రెండు రోజుల ముందే తమ చేతుల్లోకి తీసుకుని, ఎక్కడిక్కడే చెక్పోస్టులు ఏర్పాటు చేసి, బారికేడ్లతో క్యూలైన్లు సిద్ధం చేశారు. సుమారు 120 సిసి కెమెరాలు, 9 డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచారు. ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ప్రత్యేక బలగాలను కూడా భద్రత కోసం వినియోగించారు. తిరుచానూరు పరిధిలోని సుమారు 200 సిసి కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసందానం చేసి పర్యవేక్షించారు. తిరుచానూరు పుష్కరిణికి వెళ్లాలంటే క్యూలైన్ తప్పని సరి. దీంతో ముందు రోజు రాత్రి నుంచి వేలాది మంది భక్తులు క్యూలైన్లో వేచి ఉన్నారు. ఈ నెల 25వ తేది మధ్యాహ్నం 12.10 గంటలకు పంచమీతీర్థం గడియాలు ఉంటే 11 గంటల వరకు భక్తులను పుష్కరణిలోకి అనుమతించలేదు. గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి. అడుగడుగున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, భక్తులను నియంత్రించడంతో పుష్కరిణిలోకి వెళ్లేందుకు భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. పిల్లలు, వృద్ధులు పుష్కరిణిలోకి వెళ్లేందుకు భయపడ్డారు. పంచమికి వచ్చి వచ్చిన భక్తుల్లో 50 శాతంపైగా పుష్కరణిలో స్నానాలు చేయకనే వెనుతిరగాల్సిన పరిస్థితి, ఎట్టకేలకు పోలీసులు బారీ బందోబస్తు నడుమ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా చర్యలు తీసుకున్నారు. కానీ భక్తులు చాలా మంది పుణ్యసాన్నాలు అచరించేందుకు, అవకాశం కల్పించలేకపోయారని భక్తులే విమర్శలు చేశారు. ఆఖరికి స్థానికులు సైతం పంచమిరోజు సాయంత్రం పుష్కరణి స్నానాలు ఆచరించారంటే భద్రత ఎలా ఉందో ఊహించొచ్చు. ఏది ఏమైన అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవడంలో పోలీసు బాస్ సఫలమయ్యారన్నది నిజం. దేశ అధ్యక్షురాలు (రాష్ట్రపతి) ద్రౌపది ముర్ము ఈనెల 20, 21 తేదీలలో తిరుపతి తిరుమల పర్యటన చేయడంతో, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తిరుపతి జిల్లాలో ఉన్న పోలీస్ సిబ్బందితో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన సిబ్బందిని సైతం ఎంపిక చేసుకొని, రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా నిర్వహించారు. అనంతరం వెనువెంటనే తిరుచానూరు పంచమి తీర్థం భద్రతపై దృష్టి సారించారు. వేలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసి, అమ్మవారు ఉత్సవాలను సైతం భారీ భద్రత నడుమ నిర్వహించారు. ఏడాదికి ఒకసారి వచ్చే తిరుచానూరు పంచమితీర్థానికి 5 నుంచి 6 లక్షల మంది భక్తులు వస్తారన్నది వాస్తవం. పంచమి ముందు రోజుల్లోనే కాకుండా, మిగిత రోజుల్లో పుస్కరణి చుట్టు ప్రాంతాన్ని ఇరుకగా కాకుండా, విశాలంగా చేయడంలో టిటిడి శ్రద్ధ చూపి, భక్తులకు మరింత మెరుగైన చర్యలు కల్పించి, ఎక్కువ మందిభక్తులు అమ్మవారి పంచమతీర్థంలో పాలు పంచుకునేలా చర్యలు తీసుకోవాలని, పలువురు భక్తులు కోరుతున్నారు.

ప్రజాదృష్టి

ఎస్వీయూ, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : భారతదేశ భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలను ముందుకు తీసుకెళ్లడానికి ఎస్వీయూ, ఎస్.ఆర్.ఎం విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం శనివారం విసి చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా విసి ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ డీప్-టెక్ రంగాలలో జాతీయ పురోగతిని వేగవంతం చేసేందుకు, సూపర్ కంప్యూటింగ్, క్వాంటం క్విట్‌లు, క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం నావిగేషన్, థిన్-ఫిల్మ్ టెక్నాలజీలు, డైమండ్ థిన్-ఫిల్మ్ పరిశోధన, సముద్రపు నీటి విద్యుద్విశ్లేషణ, గ్రీన్ హైడ్రోజన్ , హైడ్రోజన్ నిల్వ , హైడ్రోజన్-శక్తితో కూడిన డేటా సెంటర్‌లతో సహా క్లీన్-ఎనర్జీ పరిష్కారాలు వంటి అంశాలపై ఈ అంగీకారం దృష్టి పెడుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడటానికి అధ్యాపకులు సిద్ధంగా ఉండాలని కోరారు. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, ఆవిష్కరణ, సహకారం, చురుకైన పరిశోధనల ద్వారా అవకాశాలను సృష్టించడానికి సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విసి ఆచార్య సతీష్ కుమార్, ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పరిశోధన) ఆచార్య డి. నారాయణరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్స్ , ఆచార్యులు పద్మావతి, శ్రీనివాసులు, డీన్లు నరసింహ, బాలాజీ, కిశోర్ ,పిసి. వెంకటేశ్వర్లు, ఓఎండి. హుస్సేన్,కె.టి. రామకృష్ణ రెడ్డి, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల ఆచార్యులు పాల్గొన్నారు.

దిత్వాతో తస్మాత్ జాగ్రత్త : కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, సహాయక పునరావాస ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. దిత్వా తుఫాను ముందుస్తు సహాయక చర్యలపై జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడుతో కలసి ఆర్‌డిఓ లు, సంబంధిత అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30 న దిత్వా తుఫాను తీవ్ర వాయుగుండంగా మారి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్య తీరం దాటనుందని, ఈ ప్రభావంతో నవంబర్ 30, డిసెంబర్ 1వతేదీ వరకు తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సంబంధిత నియోజకవర్గాల పరిధిలోని ఆర్‌డిఓలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలందించే అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు, సహాయక చర్యలు చేపట్టాలన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాలలో ప్రజలు ఎవరూ దాటకుండా పోలీస్ వారి సహాయంతో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపరులు పశువులు మెపడానికి మైదానాలకు వెళ్లకుండా సురక్షితంగా ఇంటి వద్దే ఉండాలని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. తుఫాను సమయంలో అత్యవసర సేవల కొరకు విద్యుత్, పంచాయతీ రాజ్, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను సహాయక చర్యల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ నిరంతరం పని చేస్తుందన్నారు. జిల్లా సచివాలయంలో సైతం నవంబర్ 30 రాత్రి నుండే కంట్రోల్ రూమ్ పని చేయనుందని, సహాయక చర్యల కొరకు ప్రజలు సంప్రదించవచ్చన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

డీఎఫ్‌ఓ సాయిబాబాకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మంగళం పరిధిలోని రణధం పురం గ్రామపంచాయతీ, బిటిఆర్ కాలనీలో కట్ట పుట్టాలమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని, ముందస్తు సమాచారం లేకుండా నిర్మాణ దశలో ఉన్న ఆలయాన్ని కూల్చివేయడం జరిగిందని, తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబాను కలిసి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం వివరించారు. స్థానికులు ఎన్నో ఏళ్లుగా అమ్మవారిని ఆరాధిస్తున్నారని, ఆలయ నిర్మాణం కోసం అటవీ శాఖ నుండి తగిన సహకారం ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ మాజీ అధ్యక్షులు ఈశ్వరయ్య, తిరుమల నగర్, మంగళం క్వార్టర్స్, రణధీరపురం పంచాయతీల టిడిపి కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, సురేష్ నాయుడు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యపై కలెక్టర్‌కు నివేదిక పంపుతాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, గోపాలకృష్ణ పురం, ఎస్టీ కాలనీ, తొర్రూరు లెక్క దాఖల సర్వే నెంబర్ 35/2 ఉన్న భూమిని కదిరివేలు మొదలియార్ ఆక్రమించుకున్నారని శుక్రవారం ధర్నా నిర్వహించిన నేపథ్యంలో, తహశీల్దార్ స్పందించి శనివారం మండల సర్వేయర్, వీఆర్వోలతో కలిసి ఆ భూములను పరిశీలించారు. ఎస్టీ కాలనీ వాసులు 35 సంవత్సరాలుగా మామిడి చెట్లు పెట్టి సాగు చేసుకుంటున్నామని తహశీల్దారుకు వివరించారు. ఈ విషయమై రిపోర్టును కలెక్టర్‌కు పంపుతామని తహశీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పుత్తూరు ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వెంకటేష్, గ్రామస్తులు రాఘవమ్మ, నాగభూషణం, రామచంద్రయ్య, కాంతారావు, గోపి తదితరులు పాల్గొన్నారు

స్విమ్స్‌లో పాలియేటివ్ కేర్ అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పాలియేటివ్ కేర్ వింగ్ అభివృద్ధిపై స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ స్విమ్స్‌లో ప్రస్తుతం వున్న ఆంకాలజీ పాలియేటివ్ కేర్‌తో పాటు, న్యూరో పాలియేషన్ నెఫ్రోపాలియేషన్, కార్డియోపాలియేషన్ సేవలను కూడా అందిస్తున్నామన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగికి పాలియేటివ్ కేర్ ఉపశమనం కలిగిస్తుందన్నారు. త్వరలో రోగుల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాలకు టెలి కన్సల్టేషన్ సౌకర్యాన్ని ప్రారంభిస్తామన్నారు. పాలియేటివ్ కేర్ వింగ్ ఇన్‌చార్జ్, రేడియేషన్ ఆంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రాణబంధు దాస్ మాట్లాడుతూ పాలియేటివ్ కేర్ వింగ్ ఓ.పి. సేవలను సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పొడిగిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, నెఫ్రాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సొంతిల్లు, ఇంటి స్థలం కోసం దరఖాస్తుకు నేడే తుది గడువు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొంత స్థలం ఉన్న వారికి ఆర్థికసాయం, లేని వారికి 3 సెంట్ల స్థలం, ఆర్థికసాయం అందించనున్నాయి. ఇందుకు సంబంధించి దరఖాస్తు గడువు నేటితో ముగియనుంది. దీంతో మండల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, అర్హులను గుర్తించే పనిలో హౌసింగ్ అధికారి హేమ కుమార్, యుగంధర్‌లు ప్రతి ఇంటికి వెళ్లి స్థలం, ఇల్లు లేని పేదలను గుర్తించే పనిలోపడ్డారు. జాబ్ కార్డులు, ఆధార్ కార్డులు సరైన సమయానికి అందుబాటులోకి రాకుపోవడంతో ఇంకో వారం రోజులు గడువు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌టీసికి ఫస్ట్ ఎయిడ్ కిట్స్ వితరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి యాజమాన్యం సౌజన్యంతో తిరుపతి ఆర్టీసీ డిపోకు100 ప్రథమ చికిత్స పెట్టెలు (ఫస్ట్ ఎయిడ్ కిట్స్) వితరణగా అందజేశారు. తిరుపతి డిపోలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా యాజమాన్యం సహకారం మేరకు సిఓఓ డాక్టర్ శ్రీధర్ ముని సూచనలతో ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బందికి ఉపయోగపడేలా ప్రథమ చికిత్స కిట్టులను అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజరు సురేంద్ర కుమార్, ఆర్టీసీ ప్రాంతీయ వైద్యశాల వైద్యులు డాక్టర్ గుణమాధురి, ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి -కోట : గూడూరు అసెంబ్లీని నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రజల మనోగతమని, గూడూరు మాకు కావాలని తిరుపతి ప్రజలు కోరలేదని గూడూరు నియోజకవర్గ బిజెపి సీనియర్ నాయకులు పేర్నాటి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా సంస్కృతి, సాంప్రదాయం, భాష, యాస గూడూరులో ప్రతిబింబిస్తుందని, గూడూరు వాసులకు నెల్లూరు అన్ని విధాలుగా అనుకూలమని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో గూడూరును నెల్లూరులో కలుపుతానని హామీ ఇచ్చారని అయితే నేడు ఆ హామీని విస్మరించి మాట తప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్ జిల్లాల నిర్మాణం చట్టం 1974 ప్రకారం ఆర్టిఐ 1498లో ప్రిలిమనరీ నోటిఫికేషన్ ఉత్తర్వులపై చట్ట ప్రకారం అభ్యంతరం తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టమూరు నాయకులు డి.గోపాల్ రెడ్డి,ఎమ్.రమేష్‌లు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, ముత్యాల రెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషియల్ ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సి.సురేష్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్స్ బుక్లెట్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు సంజీవ్ కుమార్, భాస్కర్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు యుటిఎఫ్ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.

పీరమల్ ఫైనాన్స్ ఆంధ్రప్రదేశ్‌లో విస్తరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పీరమల్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా తమ ప్రధాన విస్తరణను ప్రకటించింది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి 5 లక్షల కోట్ల రూపాయలు ఎయుఎం సాధించడం కంపెనీ లక్ష్యమని పీరమల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిటైల్ లెండింగ్ సీఈవో జగదీప్ మల్లారెడ్డి తెలిపారు. అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎన్‌బీఎఫ్‌సీలలో ఒకటిగా, తమ రిటైల్ ఫ్రాంచైజీ విస్తృతంగా బలపడుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వంటి మార్కెట్లలో విస్తృత అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. కంపెనీ గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల కోసం రాష్ట్రం అత్యంత ముఖ్యమైన మార్కెట్‌గా కొనసాగుతోందని తెలిపారు.

సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలి: శోభన్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలో లింగ వివక్షతను రూపుమాపడానికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, నయీ చేతన 4.0 కార్యక్రమాల ద్వారా వివక్షతను దూరం చేయడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. శనివారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం సందర్భంగా మార్పు కోసం ముందడుగు అనే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జెండర్ ఆధారిత వివక్షను దూరం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నవంబర్ 25వ తేదీ నుండి నాలుగు వారాలపాటు తిరుపతి జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్నామన్నారు. మహిళలను చైతన్య పరిచేందుకు నిర్మాణాత్మక వ్యూహాలను సంఘం, గ్రామ సంఘం, మండల మహిళా సమాఖ్యలలో అమలు పరుస్తున్నామన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, పౌష్టికాహారం, మహిళల ఆర్థిక సాధికారత కోసం సెర్ప్, డిఆర్డిఏ ద్వారా అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలను అవగాహన కార్యక్రమంలో వివరించమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడి, డిపిఎం, ఏపీఎం, సీసీలు, జిల్లా సమాఖ్యల ప్రతినిధులు, యానాది మహా సమాఖ్య ప్రతినిధులు, డిపిఎంయు పాల్గొన్నారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ జరగాలి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను డిసెంబర్ మాసానికి సంబంధించి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను అందించాలని, ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తగిన ఆదేశాలను ఇచ్చారని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. డిసెంబర్ మాసానికి సంబంధించి తిరుపతి జిల్లాలో 2,62108 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీకి సంబంధించి రూ.112, 69, 33500 కోట్ల రూపాయలను విడుదల చేశారన్నారు. ఏదేని కారణం చేత లబ్ధిదారు పింఛన్ అందుకొని పక్షంలో సచివాలయంలో పింఛను పొందే అవకాశం ఉందన్నారు.

పోలీస్ శాఖలో సేవ తృప్తినిచ్చింది : రమణారెడ్డి

ఎన్.వెంకటరమణ దంపతులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు హోంగార్డుగా తిరుపతి శ్రీవారి పదాలు చెంత విజిలెన్స్ కార్యాలయంలో విధులు నిర్వహించడం సంతృప్తినిచ్చిందని ఎన్.వెంకటరమణ తెలిపారు. తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో శనివారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ కొల్లమ్మ, అర్జున్ రెడ్డి దంపతులకు 1965 డిసెంబర్ 1న జన్మించిన అయన ప్రాథమిక విద్య 1 నుంచి 10 వ తరగతి వరకు ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్టలో, తిరుపతి ఎస్వి జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ కోర్సు పూర్తిచేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న సమయంలో, తన తండ్రి అర్జున్ రెడ్డి ఎస్వి జూనియర్ కళాశాలలో వాచ్మెన్‌గా విధులు నిర్వహిస్తుండేవారిని తెలిపారు. ఆయన సూచనల మేరకు పోలీస్ శాఖలో హోంగార్డుగా 1989 ప్రయత్నం చేసి 1990లో పోలీస్ శాఖలో హోంగార్డుగా ఉద్యోగం పొందినట్లు పేర్కొన్నారు. మొదటగా తిరుపతి క్రైమ్ ట్రాఫిక్‌లో, అక్కడనుంచి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసులో సీనియర్ హోమ్ గార్డ్‌గా విధులు నిర్వహించానని తెలిపారు. తన తోటి ఉద్యోగులతో సత్సంబంధాలతో మెలిగానని వెల్లడించారు. తన పూర్తి సర్వీసులో ఒక మెమో కూడా పొందని, ఉత్తమ ఉద్యోగిగా ఖ్యాతి పొందానన్నారు. తాను మాత్రం ఉత్తమ సేవల ద్వారా తనదైన శైలిలో ప్రత్యేక చొరవతో సున్నితమైన సమస్యలను, నేర్పుతో, సమయస్ఫూర్తితో పరిష్కరించి, అందరి మన్ననలను పొందానన్నారు. ఈనెల 30న పదవి విరమణ తరువాత తన శేషజీవితాన్ని తన కుటుంబ సభ్యులతో గడుపుతానని తెలిపారు. టిటిడి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఉద్యోగస్తులు, శ్రేయోభిలాషులకు తనకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తన భార్య కాంచన సహకారం అమూల్యమైనదని పేర్కొన్నారు. కుటుంబంలోనూ విధి నిర్వహణలో తనకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎఫ్పిఓల బలోపేతానికి సహకారం : శోభన్ బాబు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): ఏపీ మాస్, వాసన్ ఎన్ జిఓల భాగస్వామ్యంతో రైతు సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని, రైతులకు అవగాహన కల్పించాలని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు పిలుపునిచ్చారు. తిరుపతి నగర పరిధిలోని టీటీడీసీ కార్యాలయంలో ఎఫ్పిఓల అభివృద్ధిపై జిల్లాలోని 13 మండలాలకు సంబంధించిన ఏపీఎం, సీసీలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సభ్యులకు వర్క్ షాపు నిర్వహించమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ పి ఓ) లను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఏపీ మాస్, వాసన్ ఎన్జీవోలతో భాగస్వామ్యం అయ్యామన్నారు. ఎఫ్ పి ఓ లకు సెర్ప్, ఎన్ ఆర్ ఎల్ ఎం ప్రాజెక్టు నుండి నిధులు మంజూరు అయ్యా అన్నారు. రైతులకు న్యాయ్యమైన పంట పండించేందుకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, పరికరాల ఉపయోగం వీటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. లైవ్లీహుడ్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు తాము పండించిన పంటను వారి విక్రయించుకునే విధంగా వెసులుబాటును ఏర్పాటు చేయనున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాస్ నుండి విజయలక్ష్మి, వాసన్ నుండి సుధాకర్, ఏపీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు.. ప్రమాదానికి నిలయం : సిపిఎం

ప్రజాశక్తి -ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడులో వెంకటగిరి సర్కిల్ నుండి రైల్వే గేట్‌కు వెళ్లే మార్గాన ఆమందూరు పంచాయతీలో ఆర్ అండ్ బి రోడ్డు గుంతల మయమయింది. తుపాను ప్రభావంతో ధ్వంసమైన రోడ్డు భారీ గుంతలతో ప్రమాదాలకు నిలయంగా మారినా అధికారులు పట్టించుకోవట్లేదని సిపిఎం నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో శనివారం గుంతల మయమైన రోడ్డు వద్ద సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారుల ఈ మార్గాన్నే ప్రయాణిస్తున్నారని, గుంతలతో దర్శనమిస్తున్న రోడ్డు వారి కంటికి కనపడలేదాని ప్రశ్నించారు. నిత్యం వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - చంద్రగిరి: కమిషనర్ ఆదేశానుసారం శనివారం చంద్రగిరి మండలంలో ప్రైమరీ, హై స్కూల్ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి మండల టీంకు ఎంపికయ్యారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు భాస్కర్ బాబు పురుషుల జట్టుకు, ఎస్.లలిత కుమారి మహిళల త్రో బాల్ జట్టుకు ఆధ్వర్యం వహించారు. ఇందులో ఎస్వీ జడ్పీహెచ్ఎస్ చంద్రగిరి ప్రధానాపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, మండలంలోని ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను, పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లంలో నిర్వహించారని ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తెలియజేశారు. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారి ప్రేమలత, దయాకర్లు ప్రారంభించారు. మండలంలోని ప్రైమరీ, హై స్కూల్ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రికెట్, త్రో బాల్‌లో పాల్గొనడం జరిగింది. గెలుపొందిన వారికి డివిజనల్ స్థాయిలో జరిగే ఆటలు పోటీలకు ఎంపిక కానున్నారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి ప్రధానోపాధ్యాయులు రాజు వేలు, ఆంగ్ల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, దేవరాజులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమకారుడు రమణయ్యకు నివాళి

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో ప్రముఖ దళిత ఉద్యమకారుడు, సమాజ సేవకుడు ఆర్.వి. రమణయ్య ప్రథమ వర్ధంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, దళిత సంఘ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వర్ధంతి సందర్భంగా రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను గూర్చి సభలో పలువురు స్ఫూర్తిదాయకంగా స్మరించుకున్నారు. దళితుల హక్కుల కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం యువతకు ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. సమాజ మార్పు కోసం రమణయ్య ఆలోచనలు, సేవా భావం ఎప్పటికీ మరిచిపోలేనివని, వారి ఆశయాలను కొనసాగించాలని హాజరైన నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దారా మస్తానయ్య, దళిత నాయకులు మీజూరు మల్లిఖార్జున్ రావు,బీ.ఆర్ అంబేద్కర్, రిటైర్డ్ జిల్లా సర్వేయర్ బందిల సురేంద్రబాబు, ఎస్.సుధాకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, ఎంబేటీ జయరాజు పాల్గొన్నారు.

శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా సృజనాత్మక వేడుక

ప్రజాశక్తి - చంద్రగిరి: శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన వార్షిక స్టీమ్ ఎగ్జిబిషన్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్,ఆర్ట్ మరియు మ్యాథమెటిక్స్, సోషియల్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎన్ఎస్ఎస్, క్రీడలు, రోబోటిక్స్, డాన్స్) సందర్శకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు రూపొందించిన అద్భుతమైన ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ ప్రయోగాలు, సృజనాత్మక కళానిర్మాణాలు ప్రశంసలు పొందాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను, అన్వేషణ భావనను, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడమే తమ పాఠశాల లక్ష్యమని తెలిపారు.

పంతానికి పోయి నిధులు వెనక్కి పంపడం సమంజసమా?

■ టిడిపి ఫ్లోర్ లీడర్.. గాలి జీవరత్నం నాయుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పంతానికి పోయి రూ 2 కోట్లు. నిధులు వెనక్కి పంపడం సమంజసమాని మున్సిపల్ అత్యవసర సమావేశంలో పాలకవర్గాన్ని టీడీపీ ఫ్లోర్ లీడర్, 22వ వార్డు కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు సూటిగా ప్రశ్నించారు. శనివారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ హరి అధ్యక్షతన, వైస్ చైర్మన్ జయ ప్రకాష్ నిర్వహించారు. చైర్మన్ హరి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు రెండు కోట్లు, మిగిలిన 90 లక్షలు మొత్తాన్ని అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధికి కేటాయిస్తామని తెలిపారు. అదేవిధంగా మరోసారి నాలుగు కోట్లు నిదులు వస్తాయని వాటిని మున్సిపల్ పార్కులో మరుగుదొడ్లు నిర్మించి మిగిలిన నిధులను అన్ని వార్డుల అభివృద్ధికి మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కౌన్సిలర్లు సూపర్ మాల్ట్ నష్టాల్లో జరుగుతున్నాయని చెప్పారు. గత పాలకులు ఇష్టారాజ్యంగా ఉండడంతో నష్టాలు వచ్చాయని సమాధానం చెప్పడంతో మున్సిపల్ చైర్మన్ హరి, టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడుకు వాదోపవాదాలు జరిగాయి. నగరి ఎమ్మెల్యే వార్డుల అభివృద్ధికి బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్.కింద కట్టిన రిటర్నులు తుడా నిధుల కింద రూ.2 కోట్లు తీసుకువస్తే పంతానికి పోయిన పుత్తూరు మున్సిపల్ వైకాపా పాలకవర్గం వాటిని ఖర్చు చేయకుండా, తాము పెట్టే పనులే చేయాలని వెనక్కి పంపడం ఎంతవరకూ సమంజసమని, దీనిపై ప్రజలకేమి సమాధానం చెబుతారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో మంజూరు చేసిన 1060 టిడ్కో ఇళ్లలో 423ఇళ్లు గతంలోనే నిర్మాణాలు పూర్తిచేసుకున్నాయని, మౌలికవసతులు కొంత మిగిలి ఉండడం వలన, వాటిని అతిత్వరలో పూర్తిచేసి లబ్దిదారులకు ఇస్తామన్నారు. మిగిలిన ఇళ్లు కూడా కట్టించి లబ్దిదారులకు ఇస్తామని ఎమ్మెల్యే తెలియజేశారన్నారు. ఇక్కడ వైకాపా ప్రభుత్వం 2014-19లలో అధికారంలో ఉన్నప్పటికీ ఎటువంటి మౌలికవసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేసిందని, ప్రజలు గుర్తుంచుకోవాలని తెలిపారు.పుత్తూరు మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పరిష్కరించాలని అధికారులను కోరారు. పుత్తూరు మున్సిపాలిటీలోని 27వార్డులలో ఒక్కో వార్డులో 600 నుంచి 700 ఇళ్లు ఉన్నాయని.. ప్రతి వార్డుకూ ఐదారాగురు పారిశుద్ధ్య సిబ్బంది ఉండాల్సి ఉండగా.. ఒకరు కూడా సరిగా లేరని.. సిబ్బంది కొరత ఉందని, దానివలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే ద్వారా సిబ్బంది సంఖ్య పెంచడం కోసం ప్రభుత్వానికి, సంబంధిత మంత్రికి నివేదించాలని కోరగా పాలకవర్గం ఏకీభవించి ఆమోదించింది. అలాగే మరొక కౌన్సిలర్ విద్యుత్ దీపాలు మరుగుదొడ్లు లేవని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ లోకేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-బియన్ కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, అలికెల కండ్రిగ కాటూరు గ్రామ గిరిజన కాలనీలో శనివారం పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిచినట్లు మాట్లాడితే చట్ట ప్రకారం శిక్ష అర్హులవుతారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి పర్యాటక ప్రాంతాలలో ఆర్థిక వనరులను కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గిరిజనులు ఇళ్లు, భూమి కేటాయించాలని, రేషన్ కార్డ్ సమస్యలను పరిష్కరించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో, ఎస్ఐ హరి ప్రసాద్, విఆర్వో వెంకటేశ్వర్లు, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిట్టమూరు: మండలంలోని జక్కులవానిపల్లి గ్రామ ఎస్టీ కాలనీలో శనివారం మండల అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని, ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, జక్కున్నివానిపల్లి సర్పంచ్ వేణు రెడ్డి, డిటి.నిరంజన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, ఆర్ ఐ. సుధా పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండలం, చిట్టేడు, ఎస్సీ కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని తహశీల్దార్ జయ జయ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులుతో మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, భావ ప్రకటన స్వేచ్ఛ ,పౌర రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, పాలన హక్కులు,14 సంవత్సరముల లోపు పిల్లలను వెట్టి చాకిరి పనుల్లో నియమించరాదన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దిలీప్ కుమార్ నాయక్,మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్,ఆర్ ఐ ప్రసాద్,సీ డి పి ఓ ముని కుమారి,రెవిన్యూ సిబ్బంది శ్రీధర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

హుస్సేన్ బాషాకు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్, టీడీపీ కేంద్ర కార్యాలయ రిసెప్షనిస్ట్ హుస్సేన్ భాషను చిత్తూరు పార్లమెంటరీ మైనారిటీ ఆర్గనైజర్ సెక్రెటరీ ఎస్.కె షబ్బీర్ భాష, నగరి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్ హమీద్ భాషా, విజయవాడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో కలిసి సన్మానించారు.

థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏ.వో శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, లిథీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై వివోఏలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఏ విధంగా చేరుకోవాలో ప్రణాళిక వేసుకొని క్లిన్ అండ్ గ్రీన్ విలేజ్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ వివోఏలకి తగు సూచనలిచ్చారు. శిక్షణ కార్యక్రమానికి ట్రైనర్‌గా పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ భాషా వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏ.పీ.ఎం పోలమ్మ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కమిషనర్ మౌర్యని, జిల్లా వినియోగదారుల సమాచారం కేంద్రం, కన్వీనర్ రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినియోగదారుల అవగాహన కోసం రూపొందించిన "మేలుకో వినియోగదారుడా మేలుకో ! నీ హక్కుల్ని తెలుసుకో!" పుస్తకాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం నిర్వహించే కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్యవంతం చేయడం ఒక సామాజిక బాధ్యతగా చేయాలని సూచించారు. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్రిజ్, ఏసీ సర్వీసింగ్ శిక్షణ

ప్రజాశక్తి - చంద్రగిరి: యూనియన్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో డిసెంబర్ 8 నుండి 31రోజుల పాటు రెఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ రిపేర్, సర్వీసింగ్‌లపై (పురుషులకు) శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన చిత్తూరు, తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 50సం. లోపు వయసున్న పురు షులు అర్హులన్నారు. 9494951289, 7989680587 నంబర్లను సంప్రదించాలన్నారు.

అమరం కండ్రిగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, 12వ వార్డు అమరం కండ్రిగ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరతూ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బూత్ ఇంచార్జ్ శాఖమూరి గోపికృష్ణ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. నందిమంగళం నుంచి అమరం కండ్రిగ వరకు సరైన రోడ్డు లేదని, గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని, నీటి సమస్యను పరిష్కరించాలని, వీధి లైట్లు ఏర్పాటు చాయలాని, మెరుగైన పారిశుధ్యం చేపట్టాలని తమ వినతిలో కోరినట్లు తెలిపారు. 13 వార్డు నందిమంగళంలో కమిషనర్ పర్యటించగా సిపిఎం నాయకులు ఆర్.వెంకటేష్ కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని, పారిశుధ్యం లోపించిందని, చెత్తకుండీలు లేనందున వీధుల్లో చెత్త వేస్తుండడంతో వీధులు అపరిశుభ్రంగా మారాయని కమిషనర్‌కు తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎస్వీయూలో అన్వేషణ్ - 2025

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు స్టూడెంట్ వెల్ఫేర్, కల్చర్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అన్వేషణ్-2025 కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టాటా నర్సింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మసీ, ఇంజినీరింగ్, హెల్త్ సైన్స్, న్యూట్రిషన్ రంగాల్లో వివిధ కళాశాలల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి వివిధ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మంచి సృజనాత్మక కనబరిచిన విద్యార్థులకు విశ్వవిద్యాలయం అధికారులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు ఆచార్య మురళీ ధర్, ఆచార్య నరసింహ, ఆచార్య చంద్రాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ వివేక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్..

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమవుతుందని తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు పేర్కొన్నారు. మండలంలోని పేన్నెలపాడు పంచాయతీలో శనివారం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే రైతన్నలకు యూరియా కొరత లేకుండా ఎకరాకు మూడు బస్తాల యూరియా పంపిణీ చేసిన ఘనత కూడా ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు చైర్మన్ వరదరాజు నాయుడు, చెంచయ్య, సుబ్రహ్మణ్యం ఆచారి, బాలరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఓజిలి: విద్యా శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు మండల స్థాయి ఆటలు పోటీలను ఓజిలి ఎంఈవోలు శైలజ, చంద్రశేఖర్‌లు ఉపాధ్యాయులకు క్రీడలను నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయలకు క్రికెట్, ఉపాధ్యాయునులుకి త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఆ జట్టునుండి డివిజన్ ఆటలకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.

రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి - రేణిగుంట : మల్లవరం గ్రామంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకంలో భాగంగా రెండు విడతల్లో శనివారం 364 మంది రైతులకు 50.96 లక్షలు రూపాయలు రైతుల ఖాతాల్లో వ్యవసాయానికి పెట్టుబడి కొరకు ప్రభుత్వం అందించినది. రేణిగుంట మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద రెండు విడతల్లో 3264 మంది రైతులకు 4.54 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయం కొరకు ప్రభుత్వం అందించింది. రబికి 2025-26 సీజన్లో మల్లవరం గ్రామానికి ఇప్పటివరకు 1198 యూరియా బస్తాలు 140 డిఎసి బస్తాలు రైతులకు పంపిణీ చేశారు. రేణిగుంట మండలంలో ఇప్పటివరకు 5768 యూరియా బస్తాలను రైతు సేవ కేంద్రాల ద్వారా సొసైటీ ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గం అధ్యక్షులు చిన్నారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, బుజ్జి నాయుడు, మునిస్వామి నాయుడు, భాస్కర్ రెడ్డి, రామస్వామి, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈ నెల 30 న జరగనున్న యూపీఎస్సీ - ఈపీఎఫ్ఓలో ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టులకు కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పరీక్షల నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలియజేసారు. జిల్లాలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలలో 2,727 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. సంబంధిత ఆదికారులతో శనివారం కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షలు, ఉ 9:30 నుంచి 11:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు తప్పని సరిగా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రముల వివరాలు: తిరుపతి, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజ్, (వింగ్-ఎ), ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజ్, (వింగ్-బి), శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, (వింగ్-సి), శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్ దగ్గర, ఎస్వీడబ్ల్యు డిగ్రీ కళాశాల పక్కన, తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, (వింగ్-డి), శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్ దగ్గర, ఎస్వీడబ్ల్యు డిగ్రీ కళాశాల పక్కన, తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పి.జి. కళాశాల, (వింగ్-ఇ), ఎస్వీ విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్ దగ్గర, తిరుపతి, శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, టిటిడి, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ, తిరుపతి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, యుసిఎస్‌సి, న్యూఢిల్లీ నుండి ఎన్.డి. వర్మ, అర్జున్ కుమార్ మీనా, అడిషనల్ డైరెక్టర్ కమిషనర్స్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సువాసిని పూజకు తుడా చైర్మన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ శక్తి పీఠం శ్రీ రమ్యానందభారతి స్వామి ఆధ్వర్యంలో భారత దేశంలోనే మొట్టమొదటసారిగా 10 వేల మంది సువాసినల ప్రత్యక్ష పూజ మహోత్సవం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనవలసినదిగా తుడా చైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డిని శ్రీ శక్తి పీఠం ప్రతినిధులు, అర్చకులు ఆహ్వానించారు.

తుపానుతో అప్రమత్తంగాఉండాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీలంక నుంచి చెన్నై మీదుగా దూసుకు వస్తున్న దిత్వా తుపానుతో ప్రజలు అమత్తమంగా వ్యవహరించాలని, అత్యవసరమైతే తప్ప ఎవ్వరు ఇంటి నుంచి బయటకు రావద్దని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. తిరుపతి నగరంతోపాటు చుట్టు ప్రక్కల మండలాల్లో దిత్వా తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించినందున ఆయా మండలాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. విపత్తులు వచ్చినపుడు పంచాయతీ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, యువజన విభాగం, విద్యార్థి విభాగాలకు చెందిన యువత బాధ్యత తీసుకుని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: రానున్న రెండు రోజుల్లో జిల్లాలో ద్విత్వ తుఫాన్ ప్రభావం ఉంటుందని, బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామస్థాయి, అధికారులు, సచివాలయ సిబ్బంది తుఫాన్ పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఆపత్కాలంలో కాల్ సెంటర్ నెంబరును 9491077047 సంప్రదించాలన్నారు.

ప్రజాశక్తి - వాకాడు: తుఫాను నేపథ్యంలో వాకాడు మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సహాయ చర్యల నిమిత్తం 08624221024 ఈ నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఓజిలి - నవంబర్: తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షితంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటతిరగరాదని వారికి ఏదైనా అవసరం ఉన్న ఎడల టోల్ ఫ్రీ నెంబర్ 9949637381 కు తెలుపాలని ఆర్డీవో తెలియజేశారు. ఆయన సూచనలు మేరకు 29,30, ఒకటో తేదీ వరకు ఎమ్మార్వో, ఎంపీడీవోలు, సిబ్బంది 24 గంటలు కార్యాలయాల్లో, 26 పంచాయతీల్లోని సచివాలయ సిబ్బంది ప్రజలను అప్రమత్తంగా ఉండేలాగా చూడాలని ఎంపీపీ అరుణా రెడ్డి, ఏంఆర్ఓ పద్మావతి, ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : దిత్వా తుపాను నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 29 నుండి వచ్చేనెల 3వ తేదీ వరకు తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా అప్రమత్తం గా ఉండాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలు (ఫైర్ సేఫ్టీ) అనే అంశంపై, శనివారం సిటిఆర్‌నత్తం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పుత్తూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గిరిధర్ మాట్లాడుతూ విద్యుత్ పరికరాల భద్రత, గ్యాస్ స్టవ్ ప్రమాదాల గురించి, పెట్రోల్ డీజిల్ తదితర మండే పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కే. శ్రీనివాసులు, వి. బాబురావు, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజనా, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు

అన్నదాతకు తోడుగా 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, యం.కొత్తపల్లి పంచాయితీలో దొమ్మలపాటి సతీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాని ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు, రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ వ్యవసాయంతో రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ క్షేత్ర సహాయకులు, చంద్రగిరి మండల వ్యవసాయ ఎఈవో రామ్మూర్తి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుప్రియ, సచివాలయం సిబ్బంది లక్ష్మీ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చంద్రగిరి:శ్రీనివాసమంగాపురం, శ్రీవస్కోటాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం నారాయణాద్రి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు అంతరాజి చంద్రశేఖర్ తెలిపారు. స్థానికులు, పరిసర గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకుని, అవసరమైన మందులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కలివెట్టు ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం నైతికవిలువలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చాగంటి ప్రసంగం టీవీల్లో చూపించారు. విద్యార్థులకు స్వీయ నియంత్రణ అవసరమని ఉదాహరణకు సెల్ ఫోన్‌ను ఎంత వరకు వాడాలో అంతవరకే వాడితే అది ఉపయోగపడుతుందని, అతిగా వాడితే నష్టాలు వస్తాయని చాగంటి కోటేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినిల పాల్గొన్నారు.

అవగాహనతో లైంగిక వేధింపులు నివారించొచ్చు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధిత చట్టం, 2013 పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తిరుచానూరు రోడ్డు, ఎన్టీఆర్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ (మహిళా ప్రాంగణం)లో శిక్షణ పొందుతున్న మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కే.హైమావతి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై దాడులు నిత్య కృత్యమయ్యాయని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మహిళలకు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం రీసర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, వి .ప్రీతి, శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా, నిర్వహించి, విద్యార్థులకు రుచికరంగా భోజనం వడ్డించాలని ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చిన్న బాబు సూచించారు. శనివారం మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి హేమాంబరధరరావు, వనమాలి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సభాపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని, నీర్పా కోట గ్రామంలో మండల ప్రాథమిక ఆదర్శ పాఠశాలను శనివారం రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పెట్టే భోజనం వంట చేయడం గూర్చి వివరాలు తెలుసుకున్నారు. వంట గదిలోని సామాగ్రిని తనిఖీ చేశారు. అనంతరం నెలవాయి పరిషత్ పాఠశాలలో పాఠశాల కమిషనర్ వెబ్ మీటింగ్ సిఆర్పి, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

బేటీ బచావో బేటి పడావో

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలోని ఆర్ సి పురం ఎస్టీ కాలనీలో మిషన్ శక్తి – సంబల్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జశీటీ బచావో.. బేటి పడావో కార్యక్రమం చేపట్టారు. శనివారం అంగన్వాడీ కేంద్ర పరిధిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మనీలా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు, పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిషేధంపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అమృత, వీఆర్వో ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది, తల్లులు, బాల బాలికలు పాల్గొన్నారు.

చెందోడులో రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-కోట: కోట మండలం, చెందోడు గ్రామంలో స్వర్గీయ విద్యా ప్రదాత ముప్పవరపు వెంకటేశ్వరరావు,ముప్పవరపు ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఏఓ శివకుమార్, చెందోడు పంచాయతీ సెక్రెటరీ సమాధి కిరణ్ కుమార్‌లు ప్రారంభించారు. ముందుగా వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మిల చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజల్వన చేసి నివాళులర్పించారు. ఏఓ శివకుమార్, పంచాయతీ సెక్రటరీ ఎస్.కిరణ్ కుమార్‌లు రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.రావు. ఫౌండేషన్ చైర్మన్ లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ముప్పవరపు విజయలక్ష్మి, రక్తదాతలు మేడిపల్స్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు వంశి రెడ్డి, టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

డిసెంబర్ 4న తిరుమలలో కార్తీక పర్వ దీపోత్సవం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 4వ తేదీన సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. కార్తీక పౌర్ణమినాడు శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తి అయిన తరువాత ఈ దీపోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం నేతి వత్తులతో దీపాలను వెలిగించి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తర్వాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణ మండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండి వాకిలి, ధ్వజస్తంభం, బలి పీఠం, క్షేత్ర పాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలను ఏర్పాటు చేస్తారు. 4వ తేది సహస్రదీపాలంకరణ సేవను, పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం పరిధిలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు పట్టణానికి చెందిన తండ్రి సాయి కృష్ణ, తల్లి సాయి తేజస్విని, దంపతుల కుమారుడు పోలూరు.సాయి అద్విక్ సుహాస్ మొదటి పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు నానమ్మ రమాదేవి , కుటుంబ సభ్యుల సమక్షంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కేక్ ను కట్ చేసి పలువురికి పంచిపెట్టారు .అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు అత్తి మంజూరి గోపాల్ ,చవలసురేంద్రబాబు, కన్వీనర్ రమేష్, సభ్యులు బాలచంద్ర మౌళి, నరసింహులు ,తదితరులు పాల్గొన్నారు., లైవ్లీ హుడ్ డీపీఎం వెంకటేష్, ఏపీఎం ద్రాక్షయని పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో శనివారం భవాని నగర్, ఆదరణ సంఘం వృద్ధాశ్రమం, అలాగే అలిపిరి దగ్గర ఉన్న శ్రీ పద్మావతి వృద్ధాశ్రమంలో రెండు చోట్ల వృద్ధులకు దుప్పట్లు, బియ్యం అందచేసి, అల్పాహారం వితరణ చేశారు. అల్పాహార విత్తరణ దాత లయన్ క్లబ్ నెంబర్ లయన్ కే.సేకరుడు, సుమారు రూ పదివేల రూపాయలు విలువ గల వస్తువులు రెండు వృద్ధాశ్రమాలకు అందించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ మక్కెన భాస్కర్ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ నెంబర్ కె శేఖర్ రెడ్డి గొప్ప మనసుతో రెండు వృద్ధాశ్రమాలకు పదివేల రూపాయలు విలువగల దుప్పట్లు బియ్యం, అల్పాహారము వితరణ చేయడం జరిగినదని, వారి సేవా తత్పరతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ మక్కిన భాస్కర్, లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షులు బండి మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వీ పురుషోత్తమ నాయుడు, ఉపాధ్యక్షులు జి శంకర్ సభ్యులు రామారావు, రామచంద్ర రెడ్డి, వితరణ దాత కె శేఖర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు, అలాగే లియో క్లబ్ అధ్యక్షులు నిఖిల్, కార్యదర్శి కే ధనుష్, కోశాధికారి .బి నీత్ కుమార్ సభ్యులు ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శాప్ చైర్మన్ ధన్యవాదాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుపతి నగరంలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తిరుపతి దామినేడు ప్రాంతంలో 28 ఎకరాల భూమిని స్పోర్ట్స్ సిటీ కోసం కేటాయించాలని ఆమోదం తెలిపింది. తిరుపతిని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయాలని శాప్ చైర్మన్ రవి నాయుడు చేసిన అభ్యర్థన మేరకు గతంలో తిరుపతి జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిత ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఆమోదం లభించడంతో, ఈ రోజు శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి.ఎస్.డి.ఓ, శశిధర్, కోచులు, సిబ్బంది కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ "తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ చూపిస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రానున్న రోజుల్లో దక్షిణ భారతదేశానికి తిరుపతి ప్రముఖ క్రీడా కేంద్రంగా అవతరించనుందని వెల్లడించారు.